తెలుగు దినపత్రిక
ప్రభాత jayabheridaily.com
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 01
సంచిక : 153
పేజీలు : 4
వెల : 4
మల్కాజిగిరి
సోమవారం, 25-12-2023

జయభేరి దినపత్రిక,
జయభేరి ఛానల్ లో
నిఖార్సైన
జర్నలిస్టులుగా
నిలబడాలను
కుంటున్నారా?
ఆసక్తి కలిగిన యువతి
యువకులకు అవకాశం
అనుభవం ఉన్నవారికి
ప్రాధాన్యత
email: jayabherinews@
gmail.com,
www.jayabheridaily.com
Call me: 9391 544 889

## సంక్షోభం నుంచి సంపద వైపు
# తీసుకొచ్చాం

### శ్వేతపత్రాలకు కౌంటర్ గా BRS 'స్వేదపత్రం' విడుదల




**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణ భవన్ వేదికగా స్వేదపత్రాన్ని విడుదల చేసింది బీఆర్ఎస్. గత తొమ్మిదేళ్ల కాలంలో జరిగిన అభివృద్ధి వివరాలను వెల్లడించారు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలపై వివరణ ఇవ్వాల్సిన బాధ్యత మా పార్టీపై ఉందన్నారు. తెలంగాణను గత పాలకులు నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. తెలంగాణను సంక్షోభం నుంచి సంపద వైపు నడిపించామని పేర్కొన్నారు. విధ్వంసం నుంచి వికాసం వరకు తమ ప్రయాణం సాగిందన్నారు. ఒకప్పుడు తెలంగాణ అంటే నెర్రలు బారిన నేలలు మాత్రమే ఉండేవన్నారు కేటీఆర్. కానీ గత తొమ్మిదేళ్లలో పరిస్థితి మారిపోయిందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలల్లో దోపిడీ జరిగిందన్నారు. ఉద్యమంలో కాంగ్రెస్ లోని చాలా మంది సీనియర్ నేతలు పాల్గొనలేదని దుయ్యబట్టారు. తెలంగాణను గత మిగతా 2 లో

# మరో 12 మందికి కొవిడ్

### తెలంగాణలో 38కి చేరిన యాక్టివ్ కేసుల సంఖ్య



**జయభేరి, హైదరాబాద్ :**

తెలుగు రాష్ట్రాల్లో కొవిడ్ మళ్లీ పంజా విసురుతోంది. రోజు రోజుకూ కేసుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. తెలంగాణలో శనివారం 1,322 మందికి పరీక్షలు నిర్వహించగా... 12 మందికి పాజిటివ్గా తేలింది. దీంతో రాష్ట్రంలో కరోనా చికిత్స పొందుతున్న వారి సంఖ్య 38కు చేరినట్లు వైద్యారోగ్యశాఖ ప్రకటించింది. రాష్ట్రంలో రికవరీ రేటు 99.51శాతంగా ఉందని, మరణాల రేటు 0.49శాతం ఉన్నట్లు తెలిపింది.

**డిసెంబర్ 23వ తేదీ నాటి కొవిడ్ రిపోర్ట్ వైదారోగ్యశాఖ :**

తెలంగాణలో కొత్త కొవిడ్ కేసులు 12
కోలుకున్న వారి సంఖ్య 1
మరణాల రేటు 0.49శాతం
రికరవరీ రేటు 99.51శాతం.
ప్రస్తుతం చికిత్స పొందుతున్న వారి సంఖ్య 38
శనివారం నిర్వహించిన పరీక్షల సంఖ్య 1,322

మరో 30 మంది ఫలితాలు రావాల్సి ఉంది.

కొవిడ్ నియంత్రణపై రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో వివిధ ఆస్పత్రులలో ఉన్న వెంటిలేటర్ల పనితీరును పరిశీలించాలని వైద్యశాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. పని చేయని పీఎస్ఏ ప్లాంట్ల సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. ఆక్సిజన్ కాన్సంట్రేటర్లను సరిగ్గా వినియోగించాలని... అన్ని వెంటిలేటర్లను అందుబాటులోకి తీసుకురావాలని దిశానిర్దేశం చేశారు. గాంధీ హాస్పిటల్లోనూ జీనోమ్ సీక్వెన్సింగ్ కోసం నమూనాలను పంపాలని... కోవిడ్ రోజువారీ నివేదికను ప్రతిరోజూ సాయంత్రం 4 గంటలలోపు సమర్పించాలని సూచించారు. కరోనాను ఎదుర్కొనేందుకు వివిధ సంస్థల నుంచి గత నాలుగేళ్లుగా అందిన సీఎస్ఆర్ విరాళాల జాబితాపై నివేదిక అందజేయాలని పేర్కొన్నారు.

## ఆరు గ్యారంటీలకు
# తెల్ల రేషన్ కార్డే అర్హత

### ఈ నెల 28 నుంచి దరఖాస్తులు స్వీకరణ- మంత్రి పొంగులేటి

**జయభేరి, హైదరాబాద్ :**

ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తుంది. ఇప్పటికే రెండు హామీలను అమల్లోకి తెచ్చింది. ఆరు గ్యారంటీల అమలుపై మంత్రి పొంగులేటీ శ్రీనివాస్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. తెల్ల రేషన్ కార్డు అర్హతతో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఆరు గ్యారంటీలకు సంబంధించి ఈనెల 28 నుంచి జనవరి 6 వరకు లబ్దిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. రాష్ట్ర సచివాలయంలో అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు సమావేశం నిర్వహించారు. అనంతరం సమీక్ష వివరాలను మంత్రి పొంగులేటి మీడియాకు వివరించారు. మిగతా 2 లో





2 లో

## అధికారులకు సీఎం
# వార్నింగ్

### పనిచేయడం ఇష్టంలేని వాళ్లు బాధ్యతల నుంచి తప్పుకోండి

ఐఎస్, ఐపీఎస్ అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి వార్నింగ్ ఇచ్చారు. రోజుకు 18 గంటలు పని చేయాలని సూచించారు. అలా పని చేయడం కుదరదనుకుంటే బాధ్యతల నుంచి తప్పుకోవాలన్నారు. పనిచేయడం ఇష్టం లేని వాళ్ల సీఎస్, డీజీపీకి చెప్పి బాధ్యతల నుంచి తప్పుకోవాలన్నారు. బాధ్యత తీసుకుంటే పూర్తి స్థాయిలో నిర్వర్తించాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆదివారం అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు.

### అన్ని గ్రామాల్లో 'ప్రజా పాలన' సభలు

#### కలెక్టర్ల సమావేశంలో సీఎం రేవంత్ కీలక నిర్ణయాలు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో డా.బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో జిల్లా కలెక్టర్లు, సీపీలు, ఎస్.పి ల సమావేశం ప్రారంభమైంది. ఈ కీలకమైన సమావేశానికి ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, సీ.ఎస్ శాంతి కుమారి, డీజీపీ రవీ గుప్తా, వివిధ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈనెల 28 నుండి 6 వ తేదీ వరకు ప్రజాపాలన నిర్వహిస్తామని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని గ్రామాలు, మున్సిపల్ వార్డులలో సభల నిర్వహణ ఉంటుందన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం.2 గంట వరకు, తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుండి సా.5 గంటల వరకు సభల నిర్వహణ ఉంటుందని పేర్కొన్నారు. ఇక ఎన్నికల హామీల్లో మిగతా 2 లో



## ప్రియాంకకు కాంగ్రెస్ లో కీలక బాధ్యతలు..

రాజస్థాన్ మాజీ ఉప ముఖ్యమంత్రి సచిన్ పైలట్ ను ఛత్తీస్ గఢ్ పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ గా నియమించారు. చత్తీస్ గఢ్ లో ఇటీవలి ఎన్నికల్లో బిజెపి చేతిలో కాంగ్రెస్ ఓడిపోయిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే శనివారం పార్టీలో పలు సంస్థాగత మార్పులకు ఆమోదం తెలిపినట్లు కాంగ్రెస్ ఒక ప్రకటనలో తెలిపింది.

ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల తర్వాత, కీలకమైన లోక్ సభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ సంస్థాగత పునర్వ్యవస్థీకరణలో ప్రియాంక గాంధీ వాద్రాను ఉత్తర ప్రదేశ్ కాంగ్రెస్ ఇంచార్జ్ పదవి నుండి తొలగించారు. అయితే, ఆమె కాగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతారు. ప్రస్తుతానికి ఆమెకు ఎలాంటి బాధ్యతలను ఇవ్వలేదు. దాంతో, ఆమెకు పార్టీలో మరింత కీలక బాధ్యతలను ఇవ్వనున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి.

ముకుల్ వాస్నిక్ ను గుజరాత్, జితేంద్ర సింగ్ ను అస్సాం, మధ్యప్రదేశ్, రణదీప్ సింగ్ సుర్జేవాలా ను కర్ణాటక, దీపక్ బబరియా ను ఢిల్లీ, హర్యానా, అవినాష్ పాండే ను ఉత్తరప్రదేశ్, కుమారి సెల్జా ను ఉత్తరాఖండ్ రాష్ట్రాలకు ఇన్ చార్జ్ లుగా నియమించారు. జార్ఖండ్ తో పాటు పశ్చిమబెంగాల్ అదనపు బాధ్యతలను జీఎస్ మీర్ కు, కేరళ, లక్షద్వీప్ లతో పాటు, తెలంగాణ అదనపు బాధ్యతలను దీపా దాస్ మున్షీకి, మహారాష్ట్రకు రమేశ్ చెన్నితలను, బీహార్ కు మోహన్ ప్రకాశ్ ను, మేఘాలయ, మిజోరాం, అరుణాచల్ ప్రదేశ్ లకు డాక్టర్ చెల్లకుమార్ ను, ఒడిశా, తమిళనాడు, పుదుచ్చేరిలకు డాక్టర్ అజయ్ కుమార్ ను, జమ్ముకశ్మీర్ కు భరత్ సింగ్ సోలంకీని, హిమాచల్ ప్రదేశ్, చండీగఢ్ లకు రాజీవ్ శుక్లా ను ఇన్ చార్జ్ లుగా నియమించారు.సుఖ్జీందర్ సింగ్ రాంధవా కు రాజస్తాన్, దేవేందర్ యాదవ్ కు పంజాబ్, మాణిక్ రావ్ ఠాక్రేకు గోవా, డామన్ డయ్యూ, దాద్రా నగర్ హవేలీల బాధ్యతలను అప్పగించారు. మాణిక్ రావ్ ఠాగూర్ కు ఆంధ్రప్రదేశ్ తో పాటు అండమాన్ నికోబార్ బాధ్యతలను అదనంగా ఇచ్చారు.

## మరో ఆరుగురు ఐఏఎస్ లు బదిలీ



**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణ ప్రభుత్వం మరో ఆరుగురు ఐఏఎస్లు, ఒక ఐపీఎస్ అధికారిని బదిలీ చేసింది. ఈ మేరకు సీఎస్ శాంతి కుమారి ఉత్తర్వులు జారీచేశారు. రవాణాశాఖ కమిషనర్గా జ్యోతి బుద్ధ ప్రకాష్, ఎక్సైజ్ కమిషనర్గా శ్రీధర్ నియమించింది. ఆయనకు టీఎస్ఐఐసీ ఎండీగా అదనపు బాధ్యతలు అప్పగించింది ప్రభుత్వం. రంగారెడ్డి జిల్లా కలెక్టర్గా ఉన్న భారతి మిగతా 2 లో



## వేదికపై ప్రసంగిస్తూ.. కుప్పకూలి మరణించిన ఐఐటీ కాన్పూర్ ప్రొఫెసర్!

ఐఐటీ కాన్పూర్లో విషాదకర సంఘటన చోటుచేసుకుంది. ఓ 53ఏళ్ల సీనియర్ ప్రొఫెసర్.. అలుమ్ని మీట్లో ప్రసంగిస్తుండగా ఒక్కసారిగా మిగతా 2 లో

## విద్యార్థినిపై లైంగిక వేధింపులు

### ప్రైవేట్ కాలేజీ ఛైర్మన్ పై కేసు నమోదు!



**జయభేరి, వరంగల్ :**

వరంగల్ లోని ఓ ప్రైవేట్ కాలేజీలో విద్యార్థినిపై లైంగిక వేధింపుల వ్యవహారం కలకలం రేపింది. ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థినుల పట్ల మిగతా 2 లో

jayabheridaily.com
ప్రభాత జయభేరి

▸▸ మొదటిపేజీ తరువాయి

## అధికారులకు సీఎం వార్నింగ్

ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి వార్నింగ్ ఇచ్చారు. రోజుకు 18 గంటలు పని చేయాలని సూచించారు. అలా పని చేయడం కుదరదనుకుంటే బాధ్యతల నుంచి తప్పుకోవాలన్నారు. పనిచేయడం ఇష్టం లేని వాళ్లు సీఎస్, డీజీపీకి చెప్పి బాధ్యతల నుంచి తప్పుకోవాలన్నారు. బాధ్యత తీసుకుంటే పూర్తి స్థాయిలో నిర్వర్తించాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆదివారం అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. మాది ఉద్యోగుల ఫ్రెండ్లీ గవర్నమెంట్ అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజలతో ఫ్రెండ్లీగా ఉన్నంత వరకే ఫ్రెండ్లీ గవర్నమెంట్ అన్నారు. అధికారులు సంక్షేమం అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. అధికారులు ఎలాంటి పరిస్థితుల్లోనైనా పనిచేయగలమనే ఆలోచనతో ఉండాలన్నారు. అధికారులకు మానవీయ కోణం చాలా ముఖ్యమన్నారు. తెలంగాణ డీఎన్ఏలోనే స్వేచ్ఛ ఉందన్న సీఎం.. ప్రజల స్వేచ్ఛను హరిస్తే ఎంతటి వారైనా ఇంటికి పోవాల్సిందే అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం పెంచేలా కలిసి పనిచేద్దామన్నారు. శాంతి భద్రతల పర్యవేక్షణలో పోలీసులకు ఫుల్ పవర్ ఇస్తున్నామన్నారు. అక్రమార్కులు, అవినీతి పరులు, భూకబ్జా దారులను ఎట్టి పరిస్థితుల్లో ఊపేక్షించవద్దని సీఎం రేవంత్రెడ్డి ఆదేశించారు. తెలంగాణ ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు, అధికారులు జోడెద్దుల్లా కలిసి పనిచేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. సమన్వయం లేకపోతే అనుకున్న లక్ష్యం దిశగా వెళ్లలేమన్నారు. ప్రభుత్వ నిర్ణయాలను క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సింది అధికారులేనని గుర్తుచేశారు. గ్రామ సభలు ద్వారా అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలని సూచించారు. అభివృద్ధి అంటే అద్దాల మేడలు, రంగుల గోడలు కాదన్న సీఎం రేవంత్ రెడ్డి... పేదలందరికీ సంక్షేమం అందితేనే అభివృద్ధి అన్నారు. ఇతర రాష్ట్రాల అధికారులు స్థానిక భాష నేర్చుకోవాలని కోరారు. ప్రజా సమస్యలను మానవీయ కోణంలో ఆలోచించి పరిష్కరించాలన్నారు. ప్రజలతో గౌరవం ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో అధికారులు ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఈ నెల 28 నుంచి జనవరి 6 వరకు గ్రామాల్లో 'ప్రజాపాలన' కార్యక్రమం నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అన్ని గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహించి సమస్యలు తెలుసుకోవాలన్నారు. గ్రామ సభల ద్వారా లబ్దిదారులను ఎంపిక చేయాలన్నారు.

## అన్ని గ్రామాల్లో 'ప్రజా పాలన' సభలు

భాగంగా ఇచ్చిన... 100 రోజుల్లో ఆరు గ్యారంటీల అమలుకు సంబంధించిన కార్యాచరణపై ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి చర్చించారు. మహాలక్ష్మి, కొత్త రేషన్ కార్డులు, ధరణి పోర్టల్ పై కూడా సమావేశంలో చర్చించినట్లు తెలిసింది. గిగ్ వర్కర్ల కోసం సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆటో, క్యాబ్ డ్రైవర్లు, ఫుడ్ డెలవరీ బాయ్స్ కు రూ.5 లక్షల ప్రమాద బీమా అమలుచేస్తామని హామీ ఇచ్చారు. దీంతో పాటు రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఇటీవల స్విగ్గి డెలివరీ బాయ్ కుక్క తరిమితే భవనంపై నుంచి పడి మృతి చెందాడు. బాధితుడి కుటుంబానికి సీఎం సహాయనిధి నుంచి రూ.2 లక్షలు పరిహారం అందించాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. క్యాబ్ డ్రైవర్లకు ఓలా మాదిరిగా టీ హబ్ ద్వారా ఓ యాప్ను అందుబాటులోకి తీసుకువస్తామని సీఎం హామీ ఇచ్చారు.ఆటో, క్యాబ్ డ్రైవర్లు, గిగ్ వర్కర్లు లేవనెత్తిన అంశాలను పరిగణనలోకి తీసుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అసంఘటిత రంగాల్లో కార్మికులకు ఉపాధి, సామాజిక భద్రతకు చర్యలు తీసుకుంటామన్నారు. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం... అసంఘటిత కార్మికులకు విధాన నిర్ణయం తీసుకుంటామన్నారు. రాజస్థాన్ అమలు చేస్తున్న చట్టాన్ని అధ్యయనం చేసి వచ్చే బడ్జెట్ సమావేశాల్లో చట్టాన్ని ప్రవేశపెడతామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. సంస్థలు కూడా కార్మికులు, ఉద్యోగుల సంక్షేమంపై దృష్టి పెట్టాలన్నారు.

## సంక్షోభం నుంచి సంపద వైపు తీసుకొచ్చాం

పాలకులు తీవ్ర నిర్లక్ష్యం చేశారన్నారు. రక్తాన్ని రంగరించి రాష్ట్రాన్ని ప్రగతివైపు తీసుకొచ్చామన్నారు. అప్పు అనేది శుద్ధ తప్పు అన్నారు కేటీఆర్. అప్పులు మాత్రమే చూపించిన కాంగ్రెస్... ఆస్తులను మాత్రం దాచిందన్నారు. ఆర్టీసీ భూములపై కూడా తప్పులు చూపుతున్నారని చెప్పారు. తెలంగాణ ఒక విఫల రాష్ట్రంగా చూపే ప్రయత్నం కాంగ్రెస్ చేసిందన్నారు. కానీ తెలంగాణ దేశంలోనే అగ్రభాగంగా నిలిచిందని... వివరాలతోనే ఈ స్వేదపత్రాన్ని విడుదల చేశామన్నారు. ఈ గణంకాలన్నీ ఆర్బీఐతో పాటు కేంద్ర ప్రభుత్వ సంస్థలు చెప్పిన లెక్కలే అని పేర్కొన్నారు.

తెలంగాణకు ఆస్తులు కాదే... అసిస్థిత్వాన్ని సృష్టించిన పార్టీ కూడా బీఆర్ఎస్సే అని అన్నారు. భార్గవ కమిటీ, లలిత్ కుమార్ కమిటీ కూడా తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని స్పష్టంగా చెప్పిందని గుర్తు చేశారు కేటీఆర్. విద్యుత్ విషయంలో అనేక తప్పుడు విషయాలను చెప్పారని దుయ్యబట్టారు కేటీఆర్. నోటికి వచ్చినట్లు ఇష్టం వచ్చినట్లు కాంగ్రెస్ నేతలు మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ఏర్పడిన నాటికి కరెంట్ కష్టాలు ఉండేవని... కానీ ఇవాళ పరిస్థితెంటో చూస్తే అర్థమవుతుందన్నారు. పదేళ్లలో 12 వేల మెగావాట్ల విద్యుత్ సామర్థ్యాన్ని పెంచి చూపామన్నారు. యాదాద్రి పవర్ ప్లాంట్ పూర్తి అయితే... 25వేల మెగవాట్లకు విద్యుత్ సామర్థ్యం పెరుగుతుందన్నారు. తలసారి విద్యుత్ వినియోగంలో కూడా... తెలంగాణ అగ్రస్థానంలో ఉందన్నారు కేటీఆర్.

## ఆరు గ్యారంటీలకు తెల్ల రేషన్ కార్డే అర్హత

ఆరు గ్యారంటీలకు సంబంధించిన అప్లికేషన్లను ప్రజలకు అందిస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. ఈనెల 28 నుంచి జనవరి 6 వరకు గ్రామసభల ద్వారా ఆరు గ్యారంటీలు దరఖాస్తులు తీసుకుంటామన్నారు. గ్రామసభల్లో అర్హులు అధికారులకు దరఖాస్తులు అందజేయాలన్నారు. ప్రజలు నుంచి దరఖాస్తులను తీసుకున్న తర్వాత అధికారులు ఒక రసీదు ఇస్తారన్నారు. అధికారులే గ్రామాలకు వెళ్లి అప్లికేషన్లు స్వీకరిస్తారన్నారు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ పూర్తైన తర్వాత లబ్దిదారులను అధికారులు నిర్ణయిస్తారన్నారు. కొన్ని గ్రామాలు దూరంగా ఉన్నాయని, అలాంటి ప్రాంతాలకు అధికారులే వెళ్లాలన్నారు.

కక్ష సాధింపు చర్యలు ఉండవు. పదేళ్ల తర్వాత తెలంగాణలో ప్రజా పాలన మొదలైందని మంత్రి పొంగులేటి అన్నారు. గత ప్రభుత్వంలో అధికారుల సూచనలు, అభిప్రాయాలు తీసుకునే పరిస్థితి ఉండేది కాదని ఆరోపించారు. అధికారుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకున్నామన్నారు. డ్రగ్స్ అరికట్టడంలో ఐపీఎస్ లకు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారన్నారు. ధరణితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ధరణి పేరుతో గత ప్రభుత్వంలో కొందరు భూములు వారి పేరుతో రిజిష్టర్ చేసుకున్నారన్నారు. ప్రజలకు మంచి పాలన అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి స్పష్టమైన అవగాహన ఉందన్నారు. చాలా ఏళ్ల తర్వాత అధికారులు స్వతంత్రంగా మాట్లాడారన్నారు. అధికారులపై కక్ష సాధింపు చర్యలు ఉండవన్నారు. కానీ తప్పు చేస్తే ఎవరినైనా ఉపేక్షించేది లేదని సీఎం స్పష్టం చేశారన్నారు. ధరణిపై త్వరలో సమీక్ష నిర్వహిస్తామన్నారు. ధనిక రాష్ట్రమైన తెలంగాణను 6 లక్షల అప్పుల్లో ముంచారన్నారు. విద్యుత్ రంగంలో రూ.81 వేల కోట్ల అప్పులు ఉన్నట్లు బీఆర్ఎస్ నేతలే ఒప్పుకున్నారన్నారు.

# ఎంపీ బరిలో వీళ్లేనా...

**జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 24 :** ఆ నేతలు పార్లమెంటు సీటుపై కన్నేశారా..? అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిన పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సై అంటున్నారా..? లోక్ సభ కు పోటీ చేసేందుకు పావులు కదుపుతున్నారా..? ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే.. అదే అనిపిస్తోంది. వచ్చే ఏడాది జరుగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అప్పుడే లాబీయింగ్ మొదలు పెట్టినట్లు కనిపిస్తోంది. పలువురు నేతలు పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు ప్రకటించుకుని ప్రచారంలో దూసుకుపోతున్నారు.తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు ముగిశాయి. ఇప్పుడు అన్ని పార్టీలు పార్లమెంట్ ఎన్నికలపై దృష్టి పెట్టాయి. ఏ నియోజకవర్గానికి ఎవరు అభ్యర్థి అయితే బాగుంటుంది అనే దానిపై ప్రధాన పార్టీలు కసరత్తు కూడా చేస్తున్నాయి.. ఈ క్రమంలోనే భారతీయ జనతా పార్టీ కూడా అభ్యర్థుల విషయంలో దృష్టి పెట్టినట్టు సమాచారం. అయితే కొందరు పార్టీ నేతలు పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేసేందుకు సమాయత్తమవుతుండటం పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతుంది. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన వారు సైతం పార్లమెంట్ బరిలో దిగేందుకు సై అంటున్నారని పార్టీ వర్గాలు అనుకుంటున్నాయి.ఎమ్మెల్యేలుగా పోటీ చేసిన సిట్టింగ్ ఎంపీలు మరోసారి తాము ప్రాతినిధ్యం వహిస్తున్న పార్లమెంటు స్థానాలు నుండి పోటీ చేసే అవకాశం ఉంది. అయితే అదిలాబాద్ పార్లమెంట్ స్థానంలో ప్రస్తుతం ఎంపీ పోటీ చేస్తారా లేదా అనే సందేహం వ్యక్తం అవుతుంది. బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాబూరావు తనకు ఆ టికెట్ ఇస్తారని హామీ ఇచ్చారని చెప్పుకుంటున్నారు. ఇక ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసిన ఈటెల రాజేందర్, రఘునందన్ రావు, సుభాష్ రెడ్డి,



కొండేటి శ్రీధర్, హుస్సేన్ నాయక్, ఆచారిలు సైతం ఎంపీలుగా పోటీ చేసేందుకు సమాయత్తం అవుతున్నట్టు తెలుస్తోంది. పార్టీ అవకాశం ఇస్తే పోటీ చేస్తామని ఈటెల రాజేందర్, రఘునందన్ రావులు ఇప్పటికే ప్రకటించారు కూడా ఈటెల రాజేందర్ మల్కాజ్ గిరి, మెదక్ స్థానాల్లో ఏదో ఒక చోట నుండి పోటీ చేసే అవకాశం ఉంది. అయన ఎక్కడ నుండి పోటీ చేయాలనే ఆలోచనలో ఉన్నారని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఇక మెదక్ నుండి రఘునందన్ రావు గతంలో పోటీ చేశారు. ఇప్పుడు కూడా పోటీ కి రెఢీ అంటున్నారు. జహీరాబాద్ పార్లమెంట్ స్థానం నుండి, ఎల్లారెడ్డి అసెంబ్లీ స్థానం నుండి పోటీ చేసిన సుభాష్ రెడ్డి మరోసారి పోటీ చేయాలని అనుకుంటున్నారట. ఇక, వరంగల్ పార్లమెంట్ స్థానం నుండి వర్ధన్నపేట అసెంబ్లీకి పోటీ చేసిన కొండేటి శ్రీధర్ ఆశిస్తున్నారట. మహబూబాబాద్ పార్లమెంటు నుండి పోటీ చేసేందుకు మహబూబాబాద్ అసెంబ్లీకి పోటీ చేసిన హుస్సేన్ నాయక్ సిద్ధంగా ఉన్నారట. పెద్దపల్లి నుండి మరోసారి తనకు అవకాశం రావచ్చు అని ధర్మపురి అసెంబ్లీ స్థానం నుండి పోటీ చేసిన ఎస్ కుమార్ భావిస్తున్నారట. మల్కాజిగిరి లోక్ సభ స్థానం నుండి పోటీ చేసేందుకు ఆ పార్లమెంటు పరిధిలోని అసెంబ్లీల నుండి పోటీ చేసిన ఒకరిద్దరు కన్నేశారని కూడా పార్టీలో ప్రచారం జరుగుతుంది. అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్ప మెజారిటీ ఓటమి చవిచూసిన తల్లోజు ఆచారి కూడా తాను సైతం ఎంపీ బరిలో అంటున్నారట. మొత్తానికి అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిన పలువురు నేతలు, పార్లమెంట్ బరిలో నిలిచి తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని అనుకుంటున్నారట. మరి పార్టీ హై కమాండ్ ఎవరిని కరుణిస్తుందో.. ఎవరికి మొండి చెయ్యి చూపుతుందో వేచి చూడాల్సిందే..!



# వింటర్ టూర్ కు నార్త్ రెడీ

**జయభేరి, న్యూఢిల్లీ, డిసెంబర్ 24 :** ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ హోటళ్లు అన్నీ నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. హోటళ్ల విషయానికి వస్తే ప్రభుత్వ హోటళ్ల కోసం ఎవరూ చూడరు. ఇది మనం చేసే మొదటి తప్పు. తక్కువ ఖర్చుతో ట్రిప్ని ఎంజాయ్ చేయడానికి ఇంతకంటే మంచి ఆలోచన ఉండదు. విహారయాత్రకు వెళ్లేముందు మనం ఎక్కడ ఉండాలనేది ముందుగానే ఆలోచిస్తాం. సాధారణంగా మనం హోటల్ బుక్ చేసుకున్న తర్వాత విహారయాత్రకు వెళ్తుంటాం. ఇక ఏడాది చివర్లో వింటర్ వెకేషన్స్ కోసం టూర్లకు వెళ్లేవారికి హోటల్ బుకింగ్ కష్టంగా మారుతుంది. ధర కూడా ఖరీదు అవుతుంది.. ఇవన్నీ తెలిసినా కూడా ప్రయివేటు హోటళ్లపై దృష్టి సారించడం వల్ల ప్రభుత్వ హోటళ్లను పట్టించుకోవడం లేదు. హోటల్ మనం వెళ్లే ట్రిప్స్, సైడ్ సీన్స్ ప్రదేశానికి దగ్గరగా ఉండాలి. అన్ని సౌకర్యాలు కలిగి ఉండాలని కోరుకుంటాం.. కాబట్టి అన్ని సదుపాయాలు కలిగి ఉంటాయని భావించి ప్రైవేట్ హోటల్ కోసం చూస్తాము.. కానీ, ప్రభుత్వ హోటళ్లు కూడా మీకు ఇలాంటి అన్ని సౌకర్యాలను అందిస్తాయి. చిన్న చిన్న సమస్యలు ప్రతిచోటా ఉన్నాయి. మీరు పర్యాటక ప్రదేశాలను ఆస్వాదించాలనుకుంటే చిన్నలోపాలను విస్మరించాలనుకుంటే ప్రభుత్వ హోటళ్లు మీకు ఉత్తమమైనవి. మనదేశంలో దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ టూరిజం అభివృద్ధికి ప్రభుత్వ శాఖలు ఏర్పడ్డాయి. చాలా రాష్ట్రాల్లో టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా హోటళ్లు, రెస్టారెంట్లు కూడా నిర్వహించబడుతున్నాయి. ప్రైవేటు హోటళ్ల సంఖ్య ఎక్కువగా లేకపోవడంతో పర్యాటకులకు మంచి వసతి కల్పించాల్సిన అవసరం ఉన్నందున ప్రభుత్వ హోటళ్లను ప్రారంభించారు. ఇప్పుడు ప్రైవేట్ హోటళ్ల సంఖ్య పెరగడంతో ప్రభుత్వ హోటళ్లకు కాస్త డిమాండ్ తగ్గింది. కానీ ఫీచర్ల పరంగా ఈ హోటల్స్ ఇతర ప్రైవేట్ హోటళ్ల కంటే తక్కువేమీ కాదు. మన రాష్ట్రంలోనే కాకుండా, ఇతర రాష్ట్రాల్లోనూ అనేక ఉత్తమ ప్రభుత్వ హోటళ్లు ఉన్నాయి.గోవా పర్యాటకుల స్వర్గధామం. ఇక్కడికి ప్రతిరోజూ వేలాది మంది యాత్రికులు వస్తుంటారు. ఫార్మాగుడి రెసిడెన్సీ గోవాలోని ప్రభుత్వ హోటల్. అక్కడ హాయిగా ఉండొచ్చు. ఫార్మగుడి రెసిడెన్సీలో ఇండోర్, అవుట్డోర్ రెస్టారెంట్ ఉంది. ఇక్కడ మీరు చాలా తక్కువ ధరలో గదిని బుక్ చేసుకోవచ్చు. సీజన్లో డబుల్ బెడ్ రూమ్కు రోజుకు రూ.1500 వసూలు చేస్తున్నారు. 1100 ఆఫ్ సీజన్లో వసూలు చేయబడుతుందిఉదయపూర్లోని హోటల్ ఆనంద్ భవన్ అనేది ప్రభుత్వ ఆధ్వర్యంలోని హోటల్. ఇక్కడ మీరు 1900 రూపాయలతో డబుల్ బెడ్ రూమ్ బుక్ చేసుకోవచ్చు.సిమ్లాకు వచ్చే పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. తక్కువ ఖర్చుతో సిమ్లా టూర్ను పూర్తి చేయాలనుకునే వారు పీటర్ హాఫ్ హోటల్ను ఎంచుకోవచ్చు. ఇక్కడ డబుల్ బెడ్ రూమ్ కేవలం 2700 రూపాయలకే దొరుకుతుందిమీరు హిమాచల్ ప్రదేశ్ నుండి కర్ణాటక, కేరళ వరకు అన్ని రాష్ట్రాలలో ప్రభుత్వ హోటళ్లలో బస చేసేందుకు వెసులుబాటు ఉంది.. మీరు విహారయాత్రకు వెళ్లే ముందు ప్రభుత్వ హోటళ్లపై శ్రద్ధ వహించండి. ఈ హోటళ్లను ఆయా రాష్ట్ర పర్యాటక శాఖ వెబ్సైట్ ద్వారా బుక్ చేసుకోవచ్చు.

## బీఆర్ అంబేద్కర్ మహనీయుడి స్ఫూర్తితో ముందుకు సాగుదాం



**జయభేరి, మేడిపల్లి :** అణగారిన వర్గాల ఆశ జ్యోతి బీఆర్ అంబేద్కర్ మహనీయుడి స్ఫూర్తితో ముందుకు సాగుదాం టీపీసీసీ ఉపాధ్యక్షులు మేడ్చల్ కాంగ్రెస్ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్. ఈ దేశంలోని సబ్బండా వర్గాల అభ్యున్నతికి రాజ్యంగా నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ చేసిన కృషి మరువలేనిదని అ మహనీయుడి స్ఫూర్తితో ముందుకు సాగుతు అణగారిన వర్గాల హక్కులను సాధించుకోవాలని మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, టీ.పీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ కాంగ్రెస్ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ లు అన్నారు. ఆదివారం నాడు కీసర గ్రామ అంబేద్కర్ సంఘం అధ్వర్యంలో నిర్వహించిన అంబేద్కర్ జ్ఞాన మాల వందవ వారం వేడుకలో పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ దేశంలోని అణగారిన వర్గాల హక్కుల సాధన కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ అన్నారు. అందుకే ఆయన స్ఫూర్తితోనే మన హక్కుల సాధన కోసం ముందుకు సాగుదామని అన్నారు. ఈ కార్యక్రమంలో కీసర మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, గ్రామం అధ్యక్షులు, మండల్ ప్రధాన కార్యదర్శి, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలు, వార్డ్ సభ్యులు, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, బీసీ సెల్, s.c సెల్, st.సెల్ నాయకులు కార్యకర్తలను తదితరులు పాల్గొన్నారు.

## వేదికపై ప్రసంగిస్తూ..

కుప్పకూలిపోయారు. ఆ వెంటనే.. ప్రాణాలు కోల్పోయారు. ఐఐటీ కాన్పూర్లో శుక్రవారం నాడు అలుమ్ని మీట్ జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్నారు. 53ఏళ్ల సమీర్ ఖాండేకర్. ఐఐటీ కాన్పూర్ మెకానికల్ ఇంజినీరింగ్ డిపార్ట్మెంట్లో స్టూడెంట్స్ ఎఫైర్స్ డీన్గా ఆయన పని చేస్తున్నారు. కొంతసేపటి తర్వాత.. విద్యార్థులనుద్దేశించి ప్రసంగించడం మొదలుపెట్టారు సమీర్. ఆరోగ్యవంతమైన జీవితం అనే టాపిక్పై ప్రసంగం మొదలుపెట్టిన తసేపటికే.. గుండెపోటు కారణంగా ఆయన కుప్పకూలిపోయారని తెలుస్తోంది. అక్కడున్న వారందరు ఒక్కసారిగా షాక్కు గురయ్యారు. షాక్ నుంచి వెంటనే తేరుకుని.. ఐఐటీ కాన్పూర్ ప్రొఫెసర్ సమీర్ని ఆసుపత్రికి తీసుకెళలారు. కానీ ఆయన అప్పటికే మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు. సమీర్ మరణంతో ఐఐటీ కాన్పూర్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. మీడియాతో మాట్లాడిన ఓ ప్రొఫెసర్.. సమీర్కు కొలొస్ట్రాల్ లెవల్స్ చాలా ఎక్కువగా ఉన్నాయని ఐదేళ్ల క్రితమే తెలిసినట్టు వివరించారు. ప్రొఫెసర్ సమీర్ మరణంపై ఐఐటీ కాన్పూర్ మాజీ డైరక్టర్ అభయ్ కరండికర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "సమీర్ మరణ వార్త విని షాక్కు గురయ్యాను. ఆయనొక ఔట్స్టాండింగ్ టీచర్. ఔట్స్టాండింగ్ రీసెర్చర్. ఆయన మరణం విద్యార్థులకు తీరని లోటు," అని అభయ్ తెలిపారు. ఐఐటీ కాన్పూర్ ప్రొఫెసర్ సమీర్ మరణ వార్తాను.. కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో చదువుకుంటున్న ఆయన కుమారుడికి సమాచారం ఇచ్చింది విద్యాసంస్థ యాజమాన్యం. ఆయన ఇండియాకి వచ్చిన తర్వాతే.. సమీర్ అంత్యక్రియలు జరుగుతాయని తెలుస్తోంది. ప్రస్తుతం.. ఆయన మృతదేహం ఐఐటీ కాన్పూర్ హెల్త్ సెంటర్లో ఉన్నట్టు సమాచారం.

## మరో ఆరుగురు ఐఏఎస్ లు బదిలీ

హోలికేరిని జీఏడీలో రిపోర్టు చేయాలని సీఎస్ ఆదేశించారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్గా గౌతమ్ను నియమించగా, ఇంటర్ బోర్డు కార్యదర్శిగా శ్రుతి ఓజా నియమించారు. గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్గా ఈవీ నరసింహారెడ్డి, పౌరసరఫరాలశాఖ కమిషనర్గా డీఎస్ చౌహాన్ ను సీఎస్ నియమించారు. తెలంగాణలో ఇటీవల 11 మంది ఐఏఎస్ అధికారులు బదిలీ అయ్యారు. పురపాలకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన అర్వింద్ కుమార్ ను విపత్తు నిర్వహణశాఖకు బదిలీ చేశారు. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా బుర్రా వెంకటేశంను నియమించారు. ఆయనకు కళాశాల, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ గా అదనపు బాధ్యతలు అప్పగించారు. పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శిగా దానకిశోర్ నియమించారు. ఆయనకు హెచ్ఎండీఏ, సీడీఎంఏ కమిషనర్ గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సీఎస్ ఉత్తర్వులు ఇచ్చారు. జలమండలి ఎండీగా సుదర్శన్ రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శిగా క్రిస్టినా, ఆర్అండ్ బీ శాఖ ముఖ్య కార్యదర్శిగా కె.ఎస్. శ్రీనివాసరాజును ప్రభుత్వం నియమించింది. జీఏడీ కార్యదర్శిగా రాహుల్ బొజ్జా నియమితులయ్యారు. ఆయనకు ఎస్సీ అభివృద్ధిశాఖ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. అటవీ, పర్యావరణశాఖ ముఖ్యకార్యదర్శిగా వాణి ప్రసాద్ నియమితులయ్యారు. ఈపీటీఆర్ఐ డైరెక్టర్ జనరల్ గా వాణిప్రసాద్ కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. మహిళా, శిశుసంక్షేమ శాఖ కార్యదర్శిగా వాకాటి కరుణ, వాణిజ్యపన్నులశాఖ కమిషనర్ గా టి.కె. శ్రీదేవి, నల్గొండ కలెక్టర్ ఆర్వీ.కర్ణన్ వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్ గా బదిలీ అయ్యారు.

## విద్యార్థినిపై లైంగిక వేధింపులు

అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు అర్ధరాత్రి వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపిస్తూ ఓ విద్యార్థిని తల్లిదండ్రులు శనివారం కాలేజీ ఛైర్మన్ పై కాకతీయ యూనివర్సిటీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గిరిజన స్టూడెంట్ పై లైంగిక వేధింపులకు పాల్పడిన కాలేజీ ఛైర్మన్ పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వివిధ విద్యార్థి సంఘాలు ఆందోళన చేపట్టాయి. దీంతో కాలేజీ ఎదుట శనివారం రాత్రి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ములుగు జిల్లాకు చెందిన ఓ గిరిజన విద్యార్థిని హనుమకొండ భీమారంలోని ఓ ప్రైవేట్ కాలేజీ ఇంటర్మీడియట్ చదువుతోంది. తోటి విద్యార్థులతో కలిసి కాలేజీ రెసిడెన్షియల్ క్యాంపస్లోనే ఉంటోంది. ఇదిలా ఉంటే కాలేజీ ఛైర్మన్ విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపణలు వచ్చాయి. ఐదు రోజుల కిందట కల్లు తీసుకువచ్చి తాగాలని బలవంతం కూడా చేశాడని విద్యార్థినిలు ఆరోపించారు. శుక్రవారం మద్యం మత్తులో ఉన్న ఆయన అర్ధరాత్రి క్యాంపస్వద్దకు వెళ్లి.. మీ తల్లిదండ్రులు వచ్చారంటూ ములుగు జిల్లాకు చెందిన విద్యార్థినిని కిందికి పిలిచాడు. ఆమె వచ్చి చూడగా అక్కడ ఎవరూ లేరు. తన ఛాంబర్ వద్ద ఉన్నారని పిలిచి ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో భయపడిపోయిన ఆ విద్యార్థిని వెంటనే హాస్టల్ లోకి పరుగెత్తింది. అనంతరం తల్లిదండ్రులకు ఫోన్ చేసి జరిగిన విషయాన్ని చెప్పి బోరున విలపించింది. తాను హాస్టల్ లో ఉండనని, ఛైర్మన్ బాగోతాన్ని మొత్తం వివరించింది.

కన్న కూతురు ఆవేదన విని తల్లడిల్లిపోయిన బాధిత విద్యార్థిని తల్లిదండ్రులు శనివారం సాయంత్రం హాస్టల్ వద్దకు చేరుకున్నారు. అంతేగాకుండా పక్కనే ఉన్న కాకతీయ యూనివర్సిటీ గిరిజన విద్యార్థి సంఘాల నాయకులు కూడా అక్కడికి చేరుకుని ఆందోళన చేపట్టారు. అప్పటికే వీరంతా వస్తున్న సమాచారం అందుకున్న కాలేజీ ఛైర్మన్ పరారయ్యాడు. కాగా విద్యార్థినిని లైంగికంగా వేధిస్తున్న ఛైర్మన్ ను కఠినంగా శిక్షించాలని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఆందోళన విషయం తెలుసుకున్న హనుమకొండ ఏసీపీ కిరణ్ కుమార్, సీఐ కరుణాకర్, కేయూ ఎస్సైలు రాజ్ కుమార్, సురేష్ హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. బాధితులతో మాట్లాడి వివరాలు సేకరించారు.

అనంతరం కాలేజీకి సంబంధించిన సీసీ ఫుటేజీని పరిశీలించారు. కాగా తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నేపథ్యంలో అక్కడ ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. దీంతో పలుమార్లు విద్యార్థిని తల్లిదండ్రులతో మాట్లాడిన ఏసీపీ కిరణ్ కుమార్ ఎట్టకేలకు వారికి నచ్చజెప్పారు. న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం ఛైర్మన్ బాగోతంపై విద్యార్థిని తల్లిదండ్రులు కాకతీయ యూనివర్సిటీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కాలేజీ ఛైర్మన్ పై కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నామని ఏసీపీ కిరణ్ కుమార్ వివరించారు.

# రైస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ

జయభేరి, కాప్రా :

రైస్ సంస్థ ఆధ్వర్యంలో యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ వారి సౌజన్యంతో సాయిరాం నగర్ కాప్రా మున్సిపాలిటీలో గత మూడు నెలలుగా ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టి దిగ్విజయంగా పూర్తి చేసుకోవడం జరిగింది. శిక్షణ తీసుకున్న 30 మహిళలందరికీ ఉచిత కుట్టు మిషన్లు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి, రైస్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఫౌండర్ మొగుళ్ళ అమరేందర్ గౌడ్, నరేష్ కుమార్ రెడ్డి, సాయిరాం నగర్ కాలనీ ప్రతినిధులు అశోక్ గౌడ్, అబ్రహం, మాజీ వార్డ్ మెంబర్ మచ్చ శ్రీకాంత్ గౌడ్, గజేందర్, గోగారావ్, నవీన్, పాపిరెడ్డి, కుమార్, రుక్కయ్య, రంగు వెంకటేశ్వర్లు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ సౌజన్య, కుట్టుమిషన్ మిషన్ శిక్షకురాలు శ్రీమతి సరిత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ప్రతి మహిళ తను నేర్చుకున్న శిక్షణతో, ఉపాధి పెంచుకుంటూ ఆర్థిక స్వావలంబన సాధించాలని, ప్రతి మహిళ తన కాళ్లమీద తాను నిలబడాలని, ప్రతి ఒక్కరూ మహిళా పారిశ్రామిక వేత్తగా ఎదగాలని





కోరారు. అదేవిధంగా రైస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నేర్చుకున్నటువంటి మహిళలందరూ స్వయం ఉపాధి పొంది ఆర్థికంగా నిలబడాలని, కుట్టు శిక్షణ లో ఫ్యాషన్ డిజైనింగ్ నేర్చుకొని మరింత అభివృద్ధి చెందాలన, మీయొక్క పిల్లలకు చక్కటి విద్య అందించి, మంచి భవిష్యత్తు అందజేయాలని కోరారు. సంస్థ నిర్వాహకులు మొగుళ్ళ అమరేందర్ గౌడ్ మాట్లాడుతూ.. మా ఈ రైస్ సంస్థను 2009లో ప్రారంభించి గ్రామీణ ప్రాంతాలలో, పేద ప్రజలు నివసిస్తున్న అటువంటి పట్టణాలలో విద్య, జీవనోపాదులు, వ్యవసాయం, వైద్యం, ఉపాధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామని అంతేకాకుండా 490 మందికి కుట్టు మిషన్లు అందజేశామని తెలియజేశారు. ఈ సందర్భంగా కుట్టు శిక్షణ నేర్చుకున్న మహిళలు మాట్లాడుతూ.. మాకు అందించినటువంటి ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా ఆర్థికంగా నిలబడగల మని, మా సొంత కాళ్ళ మీద మేము నిలబడతామని, ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించిన రైస్ స్వచ్ఛంద సంస్థ, యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి సర్టిఫికెట్లు, కుట్టు మిషన్లు అందజేశారు.

## కమాన్ ప్రారంభించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి



జయభేరి, ఉప్పల్ :

గణేష్ నగర్ కాలనీ రోడ్ నెంబర్ 3 ఉప్పల్ లో శ్రీ స్వయంభు సంజీవని ఆంజనేయస్వామి దేవాలయం నందు జరిగిన పూజ కార్యక్రమంలో పాల్గొని కమాన్ ప్రారంభించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఉప్పల్ పల్లె రాజ్ కుమార్ గౌడ్, పిల్లి నాగరాజు, దేవాలయ ట్రస్ట్ చైర్మన్ కొంౘ్రడు హనుమంత్, సురవి సత్యపల్ రెడ్డి, రమేశ్, పుల్లా రెడ్డి, చొక్కా చారి, గణేష్, శేఖర్, హేమలత తదితరులు పాల్గొన్నారు.



## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

జయభేరి, డిసెంబర్ 24 :

చిన్ననాటి ఆటపాటలు. గొడవలు, అల్లర్లు, ఇలా ఒక్కటేమిటి చిన్ననాటి మధుర జ్ఞాపకాలను ఎవరు మరచిపోరు. సరిగ్గా 23 సంవత్సరాల క్రితం విడిపోయిన వారు తిరిగి మళ్ళీ కలుసుకున్నారు. దీనికి మేడ్చల్ జిల్లా శామిర్ పేట్ మండలం అలియబాద్ గ్రామంలోని ఉన్నత పాఠశాల వేదిక అయింది. అలియబాద్ లోని ఉన్నత పాఠశాలలో 2000, 2001 సంవత్సరం లో విద్య నభ్యసించిన పూర్వ విద్యార్థులు అలియబాద్ లోని మర్రి ఫామ్స్ లో ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు మరియు ఆనాడు విద్య బోధించిన ఉపాధ్యాయులు హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆనాటి మధుర జ్ఞాపకాలను విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు నెమరువేసుకున్నారు. ఏది ఏమైనా 22 సంవత్సరాల తర్వాత అందరూ ఒకే వేదికపై కలుసుకోవడం పట్ల అందరూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆనాడు విద్య బోధించిన అధ్యాపకులు కృష్ణారెడ్డి, దామోదర్, వెంకటస్వామి, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, శ్యామల, వెంకట్ రెడ్డి, శ్యామల , పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



## వికలాంగులకు వీల్ చైర్లు పంపిణీ

జయభేరి, డిసెంబర్ 24 :

మేడ్చల్ జిల్లా మూడు చింతల పల్లి మండలం జగన్ గూడ గ్రామంలో మనిగండ్ల కృష్ణయ్య గుప్త సన్స్ ఆధ్వర్యంలో వికలాంగులకు 10 వీల్ చైర్లు అందచేశారు. అనంతరం కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయగా వైద్యులు పలువురికి కంటి పరీక్షలు నిర్వహించారు. వికలాంగులకు వీల్ చైర్లు అందించడంతో వారు ఎంతో సంతోషం వ్యక్తం చేశారని ఈ సందర్భంగా నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మణిగండ్ల కృష్ణయ్య గుప్తా, కీసరగుట్ట బోర్డు మెంబర్ మణిగండ్ల నాగరాజ్ గుప్తా, మనిగండ్ల శంకర్ గుప్తా మనిగండ్ల ప్రవీణ్ గుప్తా, మణిగండ్ల శ్రీనివాస్ గుప్త, సంజయ్, సాకేత్ , కార్తీక్ , సూర్య వంశీ లైన్స్ క్లబ్ చీఫ్ గెస్ట్ సురేష్ కుమార్, లైన్స్ క్లబ్ ప్రెసిడెంట్ సత్యనారాయణ ,ప్రభాకర్ రెడ్డి వీరభద్రరావు, ఉప సర్పంచ్ బుద్ధి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రవీందర్ రెడ్డి, గ్రామపంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.




## అక్రమ నిర్మాణాలను వెంటనే ఆపాలి



జయభేరి, మేడిపల్లి :

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ 23వ డివిజన్ లో కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ రాసాల వెంకటేష్ యాదవ్ అనుచరుల భూకబ్జాల వివరాలను బోడుప్పల్ అఖిలపక్ష కమిటీ చైర్మన్ ఎల్లగొని బాలరాజు గౌడ్, చీరాల జంగయ్య, రాపోలు రామస్వామి, రమేశ్ ల తో ఆదివారం కలిసి క్షేత్రస్థాయిలో వివరాలు విలేకరులకు చూపించారు. స్థానిక కార్పొరేటర్ అనుచరుల భూకబ్జాలను వెంటనే అడ్డుకోవాలని బిజెపి జిల్లా కార్యదర్శి జనిగే వెంకటేష్ యాదవ్ డిమాండ్ చేశారు. రాచెరువు రికార్డుల ప్రకారం సుమారు రెండు ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. రాచెరువు వద్ద ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాలన్నారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేసి వ్యాపారం చేస్తున్నాడని ఆరోపించారు. గతంలో ప్రభుత్వ భూమి అంటూ బోర్డులు ఏర్పాటుచేసిన బోర్డులను సైతం తొలగించి ఇళ్ల నిర్మాణాలు చేస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం హరి యాదవ్ మాట్లాడుతూ.. ఈ అక్రమ నిర్మాణాలను వెంటనే ఆపాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రజల జీవితాలతో ఆటలు ఆడుతున్నారు.. వొచ్చే వర్షాకాలంలో వర్షాలు పడితే మునిగిపోయే బఫర్ జోన్ దానికి అధికారులు పర్మిషన్లు ఎలా ఇస్తున్నారో.. ప్రభుత్వ యంత్రాంగం నిద్రపోతుంద లేదా కాసులకు అమ్ముడు పోతుందా అని ప్రజలు వాపోతున్నారన్నారు. అదేవిధంగా అఖిలపక్షం నాయకులు వివిధ కులా సంఘాలు ప్రభుత్వ భూమిని రక్షించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

జయభేరి, మేడ్చల్ :

30 ఏండ్ల తరువాత బాల్యమిత్రులు ఒక చోట కలుసు కోవడం చెప్పుకోలేని మధుర అనుభవం. కుత్బుల్లాపూర్ మండలం జీడిమెట్ల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 1990, 1991 కి చెందిన విద్యార్థులు ఆదివారం మేడ్చల్ మండలంలోని మైసమ్మగూడలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అప్పటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకొని ఆత్మీయంగా పలుకరించుకున్నారు. అనంతరం పలువురు మాట్లాడుతూ గురువులు చూపించిన సన్మార్గంలో నడిచి ప్రస్తుతం ప్రతి విద్యార్థీ వివిధ వృత్తుల్లో, రాజకీయం, వ్యాపారం, ఉద్యోగాల్లో కొనసాగుతూ ఆనంద జీవితాన్ని గడుపుతున్నట్లు పేర్కొన్నారు.

ఒకే వేదికపై అలనాటి గుర్తుగా అందరూ కలిసి కేక్ కట్ చేసి ఆనందంలో మునిగిపోయారు. చిన్ననాటి కబుర్లు చెప్పుకుంటూ, ఒకరికొకరు క్షేమ సంగతులు పంచుకున్నారు. ఇలాంటి స్నేహబంధం కలకాలం కొనసాగిద్దామని తీర్మానం చేసుకున్నారు.




## ప్రకృతి రైతు విజయ్ కుమార్ కు సన్మానం

జయభేరి, ఘట్కేసర్ :

మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకొని మేడ్చల్ బిజెపి కాంటెస్టెంట్ ఎమ్మెల్యే, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఘట్కేసర్ మండల ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి ప్రకృతి రైతు విజయ కుమార్ ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి రైతు దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భూసారాన్ని కాపాడేందుకు అవలంబిస్తున్న పద్ధతులు, సేంద్రియ ఎరువుల వాడకంతో అధిక దిగుబడు లు సాధిస్తున్నందుకు విజయ్ కుమార్ కి పురస్కారం దక్కిందన్నారు. వారిని సన్మానించుకోవడం నా అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఔషపూర్ సర్పంచ్ కావేరి మచ్చేందర్ రెడ్డి, వ్యవసాయ అధికారులు ఏవో బాసిత్, ఏఈఓ జగదీష్ రెడ్డి, సినీ సర్టిఫికేషన్ నెంబర్ హైమారెడ్డి, వార్డు నెంబర్ రామచందర్, సామూహిక కార్యకర్తలు పిట్టల శ్రీశైలం, జీవన్ రెడ్డి, నాయకులు మచ్చేందర్ రెడ్డి, రమేష్, సత్యనారాయణ రెడ్డి, వెంకటేష్ గౌడ్, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.






## అనాథలు.. నిరాశ్రయుల కోసం అన్నదానం

జయభేరి, హైదరాబాద్ :

హైదరాబాద్ నగరంలో రోజు రోజుకు నిరాశ్రయులు ఎక్కువ అవుతున్నారు, ఉండడానికి ఆశ్రయంలేక ఆకలితో అలమటిస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరందరిని ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాము. నగరంలో వాహనంలో సంచరిస్తూ ఆకలితో ఉన్న అనాథలు, నిరాశ్రయులకు 243వ అన్నదాన కార్యక్రమము నిర్వహించాము. ఈ అన్నదాన కార్యక్రమములో ప్రెసిడెంట్ వై. సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఓ.పావని, సభ్యులు హరీష్ కుమార్, అఖిల్, ఇర్ఫాన్ మొదలగు వాళ్ళు పాల్గొన్నారు.



## క్రీస్తు సందేశం లోకానికి మార్గదర్శకం

జయభేరి, కాప్రా :

ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని క్రైస్తవ సోదర, సోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. లోకరక్షణ కోసం జన్మించిన ప్రభువైన యేసుక్రీస్తు లోకాన్ని సన్మార్గంలో నడిపించేందుకు ప్రజలకు సందేశం ఇచ్చారు. శాంతి, ప్రేమ అనేవి మనిషిని మనిషిగా మారుస్తాయని.. లోకానికి తెలియజేసిన ఆయన.. లోకానికి ఆదర్శం అని గుర్తు చేశారు. ఆ కారుణమయుడి ఆశీర్వాదాలు ఉప్పల్ ప్రజలకు ఎల్లప్పుడూ మెండుగా వుంటాయనే విశ్వాసాన్ని వ్యక్తం చేస్తూ.. ప్రజలకు క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.



## ఉప్పల్ ఎమ్మెల్యే ని కలిసిన సిద్దార్థ అపార్ట్మెంట్ వాసులు

జయభేరి, ఉప్పల్ :

రామంతపూర్ డివిజన్ సిద్ధార్థ అపార్ట్మెంట్ వాసులు ఆదివారం ఉప్పల్ శాసనసభ్యుడు బండారి లక్ష్మారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి తమ అపార్ట్మెంట్లో నెల కొన్న సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం సమర్పించడం జరిగింది. దానికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తమ దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో BRS రాష్ట్ర నాయకుడు గంధం నాగేశ్వరరావు , సిద్ధార్థ అపార్ట్మెంట్ వాసులు పాల్గొన్నారు.



## కట్ట మైసమ్మ దేవాలయాన్ని దర్శించుకున్న ఉప్పల్ ఎమ్మెల్యే

జయభేరి, ఉప్పల్ :

ఉప్పల్ భగత్ లో స్వయంభుగా వెలిసిన శ్రీ శ్రీ శ్రీ బొప్పన్ చెరువు కట్ట మైసమ్మ దేవాలయాన్ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి దర్శించడం జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే ని సన్మానించడం జరిగింది. అనంతరం ఆలయ కమిటీ సభ్యులైన షామీర్పేట వినోద్ రెడ్డి జన్మదిన పురస్కరించుకొని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కమ్మ లక్ష్మణ్, భాష పల్లి నిరంజన్ చారి, జట్ట కిషోర్, ఉపేందర్, కంచ మీది శివయ్య, సుక్క కిరణ్, శ్రీనివాస్ రెడ్డి, ప్రదీప్ రెడ్డి, మేకల మధుసూదన్ రెడ్డి, సతీష్ చారి, సోమిరెడ్డి, సురేష్, నరసింహ ముదిరాజ్ ఇతర నాయకులు పాల్గొనడం జరిగింది.



రామంతపూర్ మ్యాట్రిక్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న గంగాధర్ ముత్తయ్య (70)ని పరామర్శించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఈ కార్యక్రమంలో BRS రాష్ట్ర నాయకుడు గంధం నాగేశ్వర్ రావు, ముత్తయ్య కుమారుడు GM శ్రీనివాస్, శంకర్, చాంద్ పాషా, పవన్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

జయభేరి, ఉప్పల్

ప్రభాత జయభేరి
సినిమా



## వాస్తవ సంఘటనల ఆధారంగా

1989లో చిత్తూరుజిల్లా కుప్పం నేపథ్యంలో సాగే కథాంశంతో తెరకెక్కుతున్న చిత్రం 'హరోం హర'. సుధీర్‌బాబు, మాళవికశర్మ జంటగా, జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వంలో సుమంత్ జి.నాయుడు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్ర కథానాయిక మాళవికశర్మ ఫస్ట్‌లుక్‌ని మేకర్స్ విడుదల చేశారు. చీరలో అందంగా, సాంప్రదాయబద్ధంగా కార్తికేయుని సన్నిధిలో నిలబడివున్న మాళవికశర్మ స్టిల్ ఆకట్టుకునేలా ఉంది. వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కుతున్నదని మేకర్స్ చెప్పారు. ఈ చిత్రానికి కెమెరా: అరవింద్ విశ్వనాథన్.



## తగ్గేదే.. హాట్ టాపిక్‌గా త్రిష డెసిషన్..!

ఇండస్ట్రీలో రెండు దశాబ్దాలుగా సక్సెస్‌ఫుల్ కెరీర్‌ను కొనసాగిస్తూ.. ఇప్పటికీ వన్ ఆఫ్ ది లీడింగ్ హీరోయిన్‌గా కొనసాగుతున్న అతికొద్ది మంది హీరోయిన్లలో టాప్‌లో ఉంటుంది త్రిష. మణిరత్నం డ్రీమ్ ప్రాజెక్ట్ పొన్నియన్ సెల్వన్ ఫ్రాంఛైజీతో మంచి సక్సెస్ అందుకున్న త్రిష ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీయెస్ట్ హీరోయిన్‌గా మారిపోయింది. సీనియర్ హీరోలందరికీ మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా మారిపోయిందంటే త్రిష క్రేజ్ ఏ రేంజ్‌లో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇదిలా ఉంటే త్రిషకు సంబంధించిన న్యూస్ ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. కొందరు తెలుగు నిర్మాతలు ఓ సీనియర్ హీరో సినిమాలో ఫీ మేల్ లీడ్ రోల్ కోసం త్రిషను సంప్రదించగా.. ఈ బ్యూటీ మాత్రం భారీ మొత్తంలో రెమ్యునరేషన్ అడిగిందని జోరుగా చర్చ నడుస్తోంది. త్రిష సదరు నిర్మాతలను రూ.4 కోట్లు రెమ్యునరేషన్ అడిగిందని లేటెస్ట్ టాక్. ఆమె చెప్పినంత ఇచ్చుకోలేమని భావించిన నిర్మాతలు ఇక చేసేదేమి లేక ప్రత్యామ్నాయ మార్గాలపై ఫోకస్ పెట్టారని టాక్ వినిపిస్తోంది. త్రిషకు ఇది కొత్తేమీ కాదు. గతంలో కూడా ఇద్దరు అగ్రహీరోల సినిమాలను రెమ్యునరేషన్ విషయంలోనే పక్కకు పెట్టేసిందన్న టాక్ కూడా ఉంది. మొత్తానికి నాలుగు పదుల వయస్సులోనూ కుర్రహీరోయిన్లకు గట్టి పోటీనిస్తూ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తోంది. త్రిష ప్రస్తుతం మణిరత్నం కమల్ హాసన్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న KH234 కీలక హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ మూవీలో త్రిషను నయా అవతార్‌లో చూపించబోతున్నట్టు కోలీవుడ్ సర్కిల్ టాక్. అజిత్ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న Vidaa Muyarchiతోపాటు మోహన్ లాల్ నటిస్తోన్న రామ్ పార్ట్ 1 త్రిష ఖాతాలో ఉన్నాయి.

## అయన నవ్వుతూ అందర్నీ నవ్విస్తుంటారు..



మామూలుగానే అందగత్తె. దానికితోడు కళ్లు మిరుమిట్లు గొలిపే వస్త్రధారణ. ఆ అందానికి ఆ జిగేలు తోడైతే.. ఏంటి? ఇదేదో షాపింగ్‌మాల్ యాడ్‌కి సంబంధించిన స్క్రిప్ట్ అనుకుంటున్నారా?.. మీనాక్షి చౌదరి ఇన్‌స్టాలోకెళ్లి ఆమె స్టిల్స్ చూస్తే ఇలాంటి ఎక్స్‌ప్రెషన్సే వస్తాయి. కళ్లు తిప్పుకోలేం. పాత సినిమాల్లో హీరోయిన్‌లా కొన్ని కొన్ని స్టిల్స్‌లో నిండుగా చీరకట్టుకున్న మీనాక్షి చౌదరిని చూస్తే గుండె బరువెక్కక మానదు. చేసింది తక్కువ సినిమాలే అయినా ఎక్కువమంది హృదయాలను కొల్లగొట్టేసింది మీనాక్షి. సంక్రాంతికి రానున్న 'గుంటూరుకారం'తో ఈ ముద్దుగుమ్మ స్టార్‌హీరోయిన్‌గా అవతరించడం ఖాయమని పలువురు బలంగా నమ్ముతున్నారు. తన ఇన్‌స్టాలో ఫ్యాన్స్‌తో సరదాగా చిట్ చాట్ చేసిందీ అందాల భామ. మీకు చీరంటే ఇష్టమా? అనడిగితే 'నాకు తెలిసి.. స్త్రీ అందాన్ని చీర ఆవిష్కరించినట్టు ఏ డ్రెస్సూ ఆవిష్కరించదు. నా ఆల్‌టైమ్ ఫేవరెట్ శారీ..' అంటూ బదులిచ్చింది మీనాక్షి. మహేశ్‌బాబుతో సినిమా చేస్తున్నారుకదా.. ఎలావుంది ఎక్స్‌పీరియన్స్ అనంటే ' ఆయన చాలా కూల్. సందర్భోచితంగా నవ్వించడంతో దిట్ట. అంతపెద్ద సూపర్‌స్టార్ అయ్యుండి కూడా డౌన్ టు ఎర్త్ పర్సన్. నవ్వుతూ ఉంటారు.. అందర్నీ నవ్విస్తూ ఉంటారు. 'గుంటూరుకారం'లో ఆయనతో నాకు డ్యూయెట్లు కూడా ఉన్నాయి. ఎంజాయ్ చేస్తూ ఈ సినిమా చేస్తున్నాను' అంటూ చెప్పుకొచ్చింది మీనాక్షి చౌదరి.

## ప్రయోగం ఫలించింది

స్వీయ దర్శకత్వంలో విక్రాంత్ హీరోగా నటించిన చిత్రం 'స్పార్క్ లైఫ్'. మెహరీన్, రుక్సర్ ధిల్లాన్ కథానాయికలుగా నటించారు. శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సందర్భంగా శనివారం థాంక్స్ మీట్‌ను నిర్వహించారు. హీరో విక్రాంత్ మాట్లాడుతూ 'విడుదలైన అన్ని కేంద్రాల్లో మంచి స్పందన లభిస్తున్నది. థియేటర్లలో ప్రేక్షకుల మధ్య సినిమా చూశాను. అందరూ పాజిటివ్‌గా స్పందిస్తున్నారు. చివరి ఇరవై నిమిషాలు ఉత్కంఠగా ఫీలవుతున్నారు. కథలో మలుపులు ఆసక్తిని పెంచుతున్నాయి. కంప్లీట్ ఎంటర్‌టైనర్‌గా ఆకట్టుకుంటున్నది. ఈ విజయంలో భాగమైన అందరికి కృతజ్ఞతలు' అన్నారు. 'ఇదొక ప్రయోగాత్మక చిత్రం. కొత్త కంటెంట్‌ను ప్రేక్షకులు ఆదరిస్తారనడానికి ఈ సినిమానే ఉదాహరణ. ఆద్యంతం అనూహ్య మలుపులతో థ్రిల్‌ను కలిగిస్తున్నది' అని రుక్సర్ ధిల్లాన్ చెప్పింది.



Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Publishedat # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com